క్లుప్తంగా

ధనలక్ష్మీ దేవిగా భవానీ మాత



పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు గ్రామం వద్ద ఉన్న గట్టు శివాలయంలో భవానీ మాతకు ధనలక్ష్మీ అలంకరణ చేసి శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన శివ భక్తులు ఐదు లక్షల రూపాయలకు పైగా డబ్బులతో భవానీ మాతను అలంకరించి వేద పండితులతో ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు.

పరామర్శ



మల్‌రెడ్డిని పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం నల్లగుట్టపల్లెకు చెందిన సూరం వెంకటసుబ్బారెడ్డి మామ మల్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొంది కడపలో విశ్రాంతి పొందుతున్నారు. శుక్రవారం కడపలో మల్‌రెడ్డిని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఆరోగ్యవంతుడవ్వాలని ఆకాంక్షించారు.

సుండుపల్లెలో 86.04 మి.మీ. వర్షపాతం

సుండుపల్లె : మండల పరిధిలో 86.04 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. మండల ప్రజలు గత కొన్ని రోజులుగా అధిక ఎండ తీవ్రత, ఉక్కపోతతో సతమతమవుతున్న సమయంలో వర్షం కురవడం సంతోషకరమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షం వ్యవసాయ పనులకు లాభదాయకమని రైతులు తెలియజేశారు.

ఉద్యోగికి బదిలీ సాధారణం



భాస్కర్‌ను సన్మానిస్తున్న గుణశేఖర్, సిబ్బంది

గాలివీడు : ప్రభుత్వ ఉద్యోగులకు విధి నిర్వహణలో బదిలీలు తప్పనిసరిగా ఉంటాయని, ఎక్కడ పనిచేసినా గుర్తింపు దక్కేలా బాధ్యతలు నిర్వర్తించాలనిజిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గాలివీడులోని స్థానిక వెటర్నరీ హాస్పిటల్‌లో బదిలీపై వెళ్లిన పశువైద్యులు డాక్టర్ భాస్కర్‌ను డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ డి.మాలకొండయ్యతో కలసి ఆయన పూలమాలలు వేసి దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ శివారెడ్డి, గాలివీడు పశువైద్యులు డాక్టర్ నాగరాజు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఓబులవారిపల్లె : మంగంపేట అగ్రహారం ఆర్ ఆర్–2 గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గురసాల సురేష్ (35) మృతి చెందారు. శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఓరుగంటి అనిల్, రాయలసీమ జోనల్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్‌కుమార్ రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదు మేరకు తనిఖీలు

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసినట్టు డీఎల్‌డీఓ మైతిలి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ సచివాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హరిత రాయబారుల చేత ప్రతి రోజు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో, పలు రహదారుల్లో అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. ఇంటి పన్నుల చెల్లింపులు, పాత బకాయిల చెల్లింపులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జగనన్న కాలనీలో గత 15 రోజులుగా తాగునీరు రావడం లేదని ఫిర్యాదు చేశారని సమస్యను పరిష్కారం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో విద్యుత్ దీపాలు, తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలు లేకుండా చూడాలని, ప్రతి నెల తప్పనిసరిగా ప్రజల ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపడతామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ మోహతాబ్ యాస్మిన్, కార్యదర్శులు దాసరి రత్నరాజు, జానకి, బిల్ కలెక్టర్ సుజాత, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసేవరకు ప్రశ్నిస్తాం

- బాబు మోసాలను ప్రతి ఒక్కరికి తెలయజేయాలి
- సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు చంద్రబాబు కుయుక్తులు
- పథకాల పేరు మార్చి అంతా మా ఆలోచనే అంటూ ప్రగల్భాలు



కూటమి మోసాలు తెలియజేసే క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజంపేట టౌన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయుడు ప్రజలను మోసం చేస్తున్న వైనాన్ని ప్రతి కార్యకర్త ప్రతి మనిషికి తెలియచేయాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణం జీఎంసీ కళ్యాణ మండపంలో శుక్రవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆకేపాటి మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ప్రజలకు అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా అయినా జగన్ ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకాన్ని కాపికొట్టి తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అమలు చేసి ఇప్పుడు అది నారా లోకేష్ ఆలోచన అని గప్పాలు చెప్పడం చంద్రబాబు దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. పాలన పట్టాలు తప్పడంతో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రబాబునాయుడు తంటాలు పడుతున్నాడని ఎద్దేవా చేశారు. చివరికి తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారని నానా రాద్ధాంతం చేయడం చంద్రబాబునాయుడు దుర్మార్గపు రాజకీయాలకు అద్దం పడుతుందని దుయ్యబట్టారు. చంద్రబాబునాయుడు చేస్తున్న అరాచక పాలన గురించి ప్రశ్నించే వారిపై కేసులు పెడుతుండటం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా వెనకడుగు వేసే ప్రసక్తి ఉండదని, రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీగా తమపై ఉందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకు ప్రజల గొంతుకై ప్రశ్నిస్తామన్నారు. 2019వ సంవత్సరం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేనిఫెస్టోను జగన్ భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఏడాదిలోపే 99 శాతం హామీలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారని ఈ సందర్భంగా అమర్‌నాథ్ రెడ్డి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు జెనుగు కృష్ణారావుయాదవ్, డి.భాస్కర్‌రాజు, వడ్డే రమణ, నియోజకవర్గ మహిళా కన్వీనర్ మిర్యాల సురేఖ, నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, మసూద్, పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరాచకాలను అడ్డుకొని ఎదురొడ్డి నిలవాలి



అనీషా రెడ్డి

రాష్ట్రంలో మహిళల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని, నానాటికీ మహిళలపై అఘాయిత్యాలు, హత్య పెరిగిపోతున్నాయని రాజంపేట నియోజకవర్గ పరిశీలకురాలు అనీషారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బాబు పాలనపై ప్రజలు విసిగెత్తిపోయి వైఎస్సార్‌సీపీ వైపు చూస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి తప్పు చేశామని తెలుగుదేశం పార్టీ సానుభూతి పరులు కూడా ఇప్పుడు బాధపడుతున్నారన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని, అయితే వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూటమి ప్రభుత్వం అరాచకాలను అడ్డుకొని ఎదురొడ్డి నిలవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. మరో నాలుగేళ్లలోనే జగన్ సీఎం అయ్యి ప్రజా ప్రభుత్వం రాబోతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు జగన్ న్యాయం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్‌లను మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి విడుదల చేశారు.

అవసరాలకు గుక్కెడు నీళ్లులేని దుస్థితి

- తీవ్ర తాగునీటి ఎద్దడితో ప్రజల సతమతం
- పరిస్థితిపై మంత్రి సమీక్షించి పరిష్కరించాలి
- మున్సిపల్ పాలకవర్గం అధికారులకు అన్ని విధాలా సహకారం



మాట్లాడుతున్న రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, పక్కన కౌన్సిలర్లు

రాయచోటి టౌన్ : రాయచోటిలో ప్రస్తుత తాగునీటి దుస్థితి పూర్వపు స్థితిని గుర్తుకు తెస్తున్నాయని ఇది ఇలాగే కొనసాగితే రాయచోటి పట్టణంలో మునుపటి దుర్భర పరిస్థితిని ప్రజలు ఎదుర్కోవాల్సి ఉంటుందని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొన్ని రోజుల నుంచి రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. 1995 – 2000 వరకు ఎలాంటి నీటి కష్టాలు ఉన్నాయో ప్రజలు ఎన్ని కష్టాలను ఎదుర్కొన్నారో ఇంకా మర్చిపోలేదని ప్రస్తుతం అలాంటి కష్టాలే పడుతున్నట్టు రాయచోటి వాసులు మాట్లాడుకుంటుండటం చూస్తుంటే బాధేస్తోందన్నారు. ఇళ్లలో తాగునీరే కాకుండా ఇతర అవసరాల కోసం గుక్కెడు నీళ్లు లేని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు గత కొన్ని రోజుల నుంచి జీతాలు పెంచాలని సమ్మె బాట పట్టారని, వారి సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలన్నారు. అలానే మా తరపున (వైఎస్సార్‌సీపీ పాలక వర్గం) అధికారులకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. నీటి సమస్యను ఓ మున్సిపల్ ముఖ్య అధికారి దృష్టికి తీసుకెళ్లామని ఆయన మాట్లాడుతూ కార్మికుల సమ్మె కారణంగా నీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టినట్టు, కొందరికి అవగాహన లేకపోవడంతో సమస్య ఉత్పన్నం అవుతోందని తెలియజేశారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వారిని కొందరు బెదిరింపులకు గురి చేస్తున్నట్టు సదరు అధికారి తెలిపారని ఫయాజ్ బాషా పేర్కొన్నారు. కాగా ఇదే అదునుగా భావిస్తున్న నీటి ట్యాంకర్లు ఇష్టారాజ్యంగా ఒక్కో ట్యాంకర్‌కు రూ.2000ల నుంచి రూ.3000ల వరకు అమ్ముకొని డబ్బులు దండుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాయచోటి ప్రజానీకం ఎదుర్కొంటున్న నీటి ఇక్కట్లపై నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ప్రస్తుత దుస్థితిపై సమీక్షించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని మున్సిపల్ చైర్మన్ కోరారు. ఆయనతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజూర్ రహిమాన్, కౌన్సిలర్లు ఫయాజ్, శ్యామ్, ఈశ్వర్ ప్రసాద్, గువ్వల బుజ్జిబాబు, సలీమ్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి

సుండుపల్లె : మండల కేంద్రం నుంచి రాయవరానికి వెళ్లే ప్రధాన రహదారిలో కెనరా బ్యాంకు సమీపంలో వర్షం పడితే దారి మొత్తం నీటితో నిండిపోయి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఈ రోడ్డుపై నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. శుక్రవారం ఈ సమస్యపై అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్తాన్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. పలుమార్లు పత్రికా ప్రకటనలలో వచ్చినా, ఉన్నతాధికారులకు తెలియజేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అధికారులకు ఆదేశించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరారు.

విష జ్వరాలు సోకకుండా చర్యలు

సిద్దవటం : పి.కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో విషజ్వరాలు సోకకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. మండలంలోని జ్యోతి, వంతాటిపల్లె, బందారుపల్లి కాలనీ గ్రామాల్లో శుక్రవారం విష జ్వరాలపై వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మౌలాలి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

చమర్తీ స్థాయి తెలుసుకొని మాట్లాడు

సిద్దవటం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురించి మాట్లాడే స్థాయి టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజుకు లేదని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నాయకులు సిగం క్రిష్టారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా కాలంలో సంక్షేమ పథకాలు అమలు పరిచిన దేశంలోని ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినని పేర్కొన్నారు. 2024 ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను అములు చేస్తామని అబద్ధపు హామీలు చెప్పి ఇంత వరకు అమలు పరచలేదన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగానికి స్వస్తి పలికి పథకాలను అమలు చేయాలని లేదంటే వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ చొరవతో తెరుచుకున్న తాగునీటి కేంద్రం



నీటిశుద్ధి కేంద్రాన్ని పునఃప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కొండమాచుపల్లి గ్రామంలో 2022వ సంవత్సరంలో ప్రారంభమైన నీటిశుద్ధి తాగునీటి కేంద్రాన్ని టీడీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత మూడుసార్లు మూసేయడంతో పంచాయతీ సర్పంచ్ మేరువ శివనారాయణ చొరవ తీసుకొని రాజంపేట నియోజకవర్గం యూత్ విభాగం అధ్యక్షులు ఓబుల్ రెడ్డితో కలిసి శుక్రవారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో అప్పుడు జెడ్పీ చైర్మన్, ప్రస్తుత రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి చొరవతో ఏపీఎండీసీ ఖనిజాభివృద్ధి సంస్థ వారు ముందుకు వచ్చి తాగునీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి దాని నిర్వహణ కొండమాచుపల్లి సర్పంచ్ మేరువ శివనారాయణ చూసుకుంటున్నారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీకి సంబంధించిన వారు కుట్రపన్ని మూడుసార్లు మూత వేయించారని, దానికి కావాల్సిన విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేశారన్నారు. అయినా పట్టువదలకుండా తాను హైకోర్టును ఆశ్రయించడంతో ఆ నీటి శుద్ధి తాగునీటి సరఫరా కేంద్రాన్ని మరలా పునఃప్రారభం చేసి విద్యుత్ సరఫరాను అందించామన్నారు. కార్యక్రమంలో మాధవరం యువ నాయకులు పోతిరెడ్డి రామిరెడ్డి, యువ నాయకుల మాధవరం శేషారెడ్డి, ఉప సర్పంచ్ ఎంఎస్ వెంకటేశ్వర్లు, కొండమాచుపల్లి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చింతగింజల వెంకటసుబ్బయ్య, రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనాయకులు మామిళ్ల శ్రీకాంత్, యు.కృష్ణమోహన్, బి.బాలాజీ, ఎం.లక్ష్మయ్య, ఎంఎం హరి, ఎం.వెంకటస్వామి, సోమ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

వీరబల్లి : మండలంలో పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ జవహర్ బాబు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాలు పడుతుండటంతో గ్రామాలలో, మండలకేంద్రంలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం హరిత రాయబారులతో పారిశుధ్య చర్యలు చేపట్టారు. మండల పరిధిలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు రోగాలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆయన సూచించారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

గాలివీడు : సీపీఐ అన్నమయ్య జిల్లా 2వ మహాసభలను జయప్రదం చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ఆగస్టు 10, 11, 12వ తేదీలలో మదనపల్లెలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలకు కార్మికులు, కర్షకులు, మేధావులు, పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు తరలిరావాలన్నారు. అన్నమయ్య జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గత రెండు మాసాలుగా నిరంతర పోరాటం కొనసాగిస్తూ, కడప – బెంగళూరు రైల్వే లైన్, టమాట జ్యూస్ ఆధారిత పరిశ్రమ, మామిడి ఆధారిత పరిశ్రమ, నియోజకవర్గ కేంద్రంలో శీతల గిడ్డంగి కేంద్రాలు, హంద్రీనీవాలో అంతర్భాగమైన వెలిగల్లు, శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్ర, సీపీఐ గాలివీడు మండల నాయకులు కృష్ణమూర్తి, భాస్కర్, కిరణ్ కుమార్ రెడ్డి, షేక్ మస్తాన్, నాగేందర్ నాయుడు, వెంకి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు భోళా శంకర్ సేవా సమితి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పుల శంకరయ్య కుమారుడు సుబ్బుడు పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని పేదలు, ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల నాగేంద్ర, సర్పంచ్ బుడుగు శివయ్య, నూకా మహేశ్వర రెడ్డి, కొప్పుల శంకరయ్య, వి బాబు, లక్ష్మయ్య, పెనుగొండ సుబ్బరాయుడు, నాగరాజు, బాబ్జీ, ప్రశాంత్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనా దృక్పథంతోనే కొత్త ఆవిష్కరణలు



రీసోర్స్ పర్సన్స్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

రాయచోటి టౌన్ : నేటి తరం విద్యార్థులు పరిశోధన దృక్పథంతో కొత్త ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని రీసోర్స్ పర్సన్స్ డాక్టర్ ఈ.శేషు (పీహెచ్‌డీ), డాక్టర్ ఎం.చక్రధర్(అమెరికా)లు అన్నారు. శుక్రవారం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంపవరింగ్ మైండ్స్ త్రూ టెక్నాలజీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్ (డీఐపీ), కంప్యూటర్ విజన్ (సీవీ) వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అధ్యాపకులకు తెలిపారు. ఏఐ విభాగంలో జరుగుతున్న తాజా పరిశోధనలను వివరించారు. డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్‌లో చిత్ర విశ్లేషణ, ఫీచర్ ఎక్ట్రాక్షన్, ఫిల్టరింగ్ టెక్నిక్స్ పై ప్రాక్టికల్ ప్రదర్శనలు ఇప్పించాలని చెప్పారు. నిర్వహించిన వర్క్‌షాప్‌లో విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేస్తూ సమాధానాలు చెప్పారు. ప్రపంచంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులు అప్‌డేట్ అవ్వాలని కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి సూచించారు. అనంతరం రీసోర్స్ పర్సన్స్‌లను సన్మానించారు.

ఆలయ ఆవరణలో ముళ్ల పొదలు తొలగింపు

సిద్దవటం : మండల కేంద్రంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో శుక్రవారం ముళ్ల పొదలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామని దేవదాయ శాఖ మండల ఇన్‌చార్జి ఈఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం గ్రామంలోని పురాతనమైన శ్రీ రంగనాథ స్వామి ఆలయ ఆవరణంలో ఉన్న పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను కూలీలతో తొలగించినట్టు చెప్పారు.

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న 'కూటమి'

- అవినీతిపై ఫిర్యాదు చేస్తున్న పట్టించుకోకపోవడంపై ఎంపీపీ ముద్దా అసహనం
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి

పుల్లంపేట : మండలంలో జరుగుతున్న అవకతవకలపై అధికారులకు ఫిర్యాదు చేస్తున్న స్పందన లేదని పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర చేనేత పరిశ్రమ చైర్మన్ కెకె చౌదరి హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ పుల్లంపేట మండలంలో ఉపాధి హామీ కూలీల సంఖ్య మండల వ్యాప్తంగా 3200 మంది ఉండగా ఒక్క వత్తలూరు పంచాయతీలో 1200 మంది పైచిలుకు ఉపాధి కూలీలు ఉన్నారని, ఆరు వారాలలో రూ. 65 లక్షలు నిధులు స్వాహా అయ్యాయని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. అలాగే అనంతసముద్రం ఎంపీటీసీ భూ సమస్యకు సంబంధించి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. ప్రజాప్రతినిధి సమస్యకే స్పందన లేకుంటే సామాన్యులకు రెవెన్యూ అధికారులు ఎంతవరకు న్యాయం చేస్తారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ నాగా తిరుమలరావు మాట్లాడుతూ మండలంలో 4752 మందికి తల్లికి వందనం వచ్చిందన్నారు. వ్యవసాయ అధికారి శ్రీకర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 153 మంది రైతులకు ఇ–కేవైసీ చేయలేదని, అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాలు రావాలంటే తప్పనిసరిగా ఇ–కేవైసీ చేయాలన్నారు. అలాగే పశువైద్యాధికారి సుదీప్ మాట్లాడుతూ మండలంలోని రైతులకు నీటి తొట్టెలు, రేకుల షెడ్లు మంజూరయ్యాయని, కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యుత్ శాఖ ఏఈ కుమార్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో వీధిలైట్లు పట్టపగలు వెలుగుతున్నాయని, సర్పంచ్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ గతంలో మంజూరైన ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం ఎస్సీ, బీసీలకు రూ. 50 వేలు అదనంగాను, ఎస్టీలకు రూ. 70 వేలు అదనంగా మంజూరు చేసిందన్నారు. మండలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. పుల్లంపేట మండలానికి ఎంపీ నిధుల కింద మూడు బోర్లు మంజూరయ్యాయని, కావున తాగునీటి సమస్య ఉంటే వెంటనే తమను సంప్రదించాలన్నారు. కెకె చౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోగా వెంకటరత్నమ్మ, జైశంకర్ నాయుడు, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఏఈ శ్రీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలకు లేదు ష్యూరిటీ.. మోసాలే గ్యారెంటీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి చిత్రంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, అనీషారెడ్డిలు



విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

నందలూరు : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన మొత్తం మోసాలయమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నందలూరు గ్రామ పంచాయతీలోని షాదీఖానాలో మండల పార్టీ విస్తృత సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజంపేట నియోజకవర్గ పరిశీలకురాలు అనీషారెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో వైఎస్ఆర్‌సీపీ తప్పక విజయం సాధిస్తుందని, కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో అమలు చేయలేదని వీటి గురించి వైఎస్ఆర్‌సీపీ నాయకులు, ప్రజలకు వివరించాలని సూచించారు. కూటమి పాలనతో ప్రజలందరూ విసిగిపోయారని జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. వచ్చే రోజుల్లో ప్రజా వ్యతిరేక కూటమి పాలనను ప్రజలందరూ తిరస్కరిస్తారని ఆయన పేర్కొన్నారు. కూటమి పాలన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచనల మేరకు బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ఇంటింటికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, రాష్ట్ర గ్రీవెన్స్ ప్రధాన కార్యదర్శి భూమన శివశంకర్‌రెడ్డి, జెడ్పీటీసీ గడికోట వెంకటసుబ్బారెడ్డి, సౌమ్యనాథ స్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, గుండు మల్లికార్జునరెడ్డి, గీతాల నరసింహారెడ్డి, షేక్ షావలీ, అజీజ్, ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు పేదల రక్తం పీల్చే మిషన్‌లు



స్మార్ట్ మీటర్ల క్యూఆర్ స్కాన్ కోడ్ పత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : ప్రభుత్వం బలవంతంగా ప్రజల ఇండ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తోందని, అవి స్మార్ట్ మీటర్లు కాదని పేదల స్వేద, రక్తాలను పీల్చి పెట్టుబడిదారులకిచ్చే మిషన్‌లని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు విమర్శించారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సీపీఎం రాష్ట్ర కమిటీ ప్రచురించిన స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించే క్యూఆర్ స్కాన్ కోడ్ పత్రాలను ప్రజలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం రాయచోటి పట్టణంలోని బోస్‌నగర్, సందీప్ నగర్, దూదేకులపల్లె ప్రాంతాలలో ప్రతి ఇంటికీ తిరిగి విద్యుత్ స్మార్ట్ మీటర్ల వలన పేదల మీద ప్రభుత్వం నడ్డి విరిచే ప్రయత్నాలను ప్రజానీకానికి వివరించారు. ప్రతిపక్ష నేతగా నారా లోకేష్ స్మార్ట్ మీటర్లను పగలకొట్టండని చెప్పి అధికారంలోకి వచ్చాక వేగంగా స్మార్ట్ మీటర్ల ద్వారా కార్పొరేట్లకు పేదల శ్రమను దోచి పెడుతున్నాడని రామాంజులు ఆరోపించారు. ప్రజాగ్రహం మొదలు కాక ముందే ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల బిగింపు కార్యక్రమం రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాధవయ్య, ఈశ్వరయ్య, రమణయ్య, చెన్నయ్య, కదిరయ్య, గంగులయ్య, ఓబులయ్య, కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయచోటి : ప్రజలు ఎయిడ్స్ వ్యాధి పట్ల జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రజా చైతన్య సేవా సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ చెన్నారెడ్డి కోరారు. రాయచోటి పట్టణం బంగ్లా సర్కిల్ సమీపంలో శుక్రవారం ప్రజా చైతన్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఎయిడ్స్ అవేర్‌నెస్ క్యాంపునిర్వహించి పలువురికి రక్త పరీక్ష నమూనాలు సేకరించారు. బంగ్లా సర్కిల్‌కు ఉదయం గ్రామీణ ప్రాంతాల నుంచి కూలి పనులకు పట్టణానికి వచ్చే సెంటర్ కావడంతో వైద్య శిబిరానికి భారీగా జనం వచ్చి రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు మేనేజర్ స్వాతి మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని ఎయిడ్స్ వ్యాధి ఎలా వస్తుంది రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తమ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి చైతన్యం తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల చిన్నచూపు చూడటం తగదని తెలియజేశారు. కార్యక్రమంలో ఓఆర్‌డబ్ల్యూలు సుహాసిని, ఖాదర్‌వలీ, లక్ష్మీదేవి, జయలక్ష్మి, వరలక్ష్మి, పీఈలు, ప్రజలు పాల్గొన్నారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ



ఓబులవారిపల్లె: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓలు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్)/పెనగలూరు/ఓబులవారిపల్లె : విద్యార్థులకు సౌకర్యాలు అందించడంలో ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్టు మండల అధికారులు తెలియజేశారు. ఆయా మండలాల్లోని పలు వసతి గృహాలను మండల స్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఆహారం ఎలా ఉందో ఆరా తీశారు. తరగతి గదులు, వంటశాల, టాయిలెట్స్, డార్మిటరీలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు తెలియజేసిన సమస్యలను విని ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామను. ఆయా కార్యక్రమాల్లో రామాపురం మండల ప్రత్యేకాధికారి విశ్వనాథ్, ఎంపీడీఓ జాషువా, పెనగలూరు ఎంపీడీఓ విజయారావు, తహసీల్దార్ అమరేశ్వరీ, ఓబులవారిపల్లె తహసీల్దార్ యామిని రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి



సుగవాసిని సన్మానిస్తున్న దక్షిణపు మల్లీశ్వరి

రాయచోటి : వైఎస్ఆర్‌సీపీ విజయానికి అంకితభావంతో పనిచేస్తానని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దక్షిణపు మల్లీశ్వరి రాయల్ అన్నారు. శుక్రవారం రాయచోటిలో మల్లీశ్వరి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు తీసుకెళతామన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యంలను మర్యాదపూర్వకంగా కలిశారు.